దేశ సమైక్యతకు రాజ్యాంగమే మూలం

- ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వంటిది
- వక్తల పునరుద్ఘాటన
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న 16వ పోలీస్ బెటాలియన్ అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న బెటాలియన్ అధికారులు, సిబ్బంది



ఎండాడలో ర్యాలీలో పాల్గొన్న ఏఎంహెచ్‌వో కిషోర్ తదితరులు



బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో..

తగరపువలస: భారత రాజ్యాంగం మహోన్నతమైనదని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి అన్నారు. దేశ సమగ్రత, సమైక్యతలకు మూల కారణంగా నిలుస్తోందన్నారు. భారత రాజ్యాంగ 75వ వసంతోత్సవాల్లో భాగంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజ్యాంగం మనకు కన్నతల్లి వంటిదన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఆనందపురం మండలం గంభీరం ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు యు.వి.వి.ప్రసాద్, వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి చలపతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో ప్రధానోపాధ్యాయిని ఎం.వి.టి. రత్నం, ఉపాధ్యాయులు పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.
- జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో, చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రోజామణి, పీవీ లక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, విద్యార్థులు అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. తాళ్లవలసలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు భాగం గోపాలరావు, సర్పంచ్ బోని సన్నిబాబు తదితరులు అంజలి ఘటించారు.

ప్రజాస్వామ్యానికి పునాది

పీఎం పాలెం: భారత రాజ్యాంగం నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదివంటిదని ఏపీఎస్పీ 16వ పోలీస్ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌బీఎస్ పద్మనాభ రాజు అన్నారు. జీవీఎంసీ బక్కన్నపాలెంలోని బెటాలియన్ ఆవరణంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెట్లు ఇళయ సాగర్, డీఎస్పీ పి.పత్యం, నారాయణ, ఆర్ఐలు, ఎస్ఆర్ఐలు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిజ్ఞ

పద్మనాభం: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి తహసీల్దార్ ఆనందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్‌వీ పురం, బీఆర్ తాళ్లవలస, పద్మనాభం, రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ వేడుకలు నిర్వహించారు. బీఆర్ తాళ్లవలసలో ఓ విద్యార్థిఅంబేడ్కర్ వేషధారణలో అలరించాడు. విద్యార్థులు రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు.

జెడ్సీ కార్యాలయంలో..

భీమునిపట్నం: మన దేశంలో ఉండే ప్రజలందరూ సమాన హక్కులతో జీవించడానికి రూపొందించబడిన రాజ్యాంగం ఎంతో గొప్పదని జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జోనల్ కార్యాలయం వద్ద, ప్రభుత్వ ఉన్న పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జోనల్ కార్యాలయ సిబ్బంది, హైస్కూల్ హెచ్ఎం పొన్నగంటి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల రాజ్యాంగం గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. రాజ్యాంగం పట్ల గౌరవం, విధేయతలతో ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.

రాజ్యాంగానికి కట్టుబడి ఉందాం

తగరపువలస: రాజ్యాంగానికి అందరం కట్టుబడి ఉందామని సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్, నర్సింగ్ కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీబా ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ర్యాలీ

కొమ్మాది: ఎండాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవంపై సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఏఎంహెచ్‌వో డా. కిషోర్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని శైలజ, ఎన్‌సీసీ మాస్టర్ చుక్కా హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- మధురవాడలోని డా. బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శాంతకుమారి ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.



చిప్పాడ హైస్కూల్‌లో రాజ్యాంగ నిర్మాతకు నివాళి



ప్రతిజ్ఞ చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు



అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ ఆనందరావు, సిబ్బంది



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఆర్ఐ వైద్యకళాశాల విద్యార్థులు

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజన సేవ



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేద పండితులు

కొమ్మాది: రుషికొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను రెండో రోజు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం పవిత్రాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజన సేవ జరిపించినట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఉత్సవాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ



బంతి, గులాబి, జరబరా పువ్వుల అలంకరణలో అమ్మవారు

తగరపువలస: మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. బంతి, గులాబి, జరబరా పువ్వులతో అలంకరణకు గాను గుడ్డాల కృష్ణ, కృష్ణవేణి దంపతులు సహాయ సహకారాలు అందించారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి



ప్లాస్టిక్ నివారణపై బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి

భీమునిపట్నం: నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ నివారించాలని జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్లే నష్టం అధికంగా ఉందని, ఇళ్లలో అందరికీ దీనిగురించి తెలపాలని విద్యార్థులకు సూచించారు. ప్రత్యామ్నాయంగా గుడ్డ, నార సంచులను వినియోగించడం అలవాటు చేసుకోవాలని కోరారు.

క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం: వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులంతా క్రీడాస్ఫూర్తితో ఆడాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏయూ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ పోటీల్లో 52 పురుషులు, మహిళల జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. రెండు రోజులు జరిగే ఈ పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, సదుపాయాలను కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయమోహన్, హెచ్‌వోడీ ఎ.పల్లవి, స్థానిక కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష దీపోత్సవం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ వద్ద గల హరేకృష్ణ వైకుంఠం వద్ద బుధవారం నుంచి ఆదివారం వరకు అయిదు రోజుల పాటు హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం నిర్వహించనున్నారు. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఆకాశదీపం, తొలిదీపం, సాంస్కృతిక కార్యక్రమాలు, లక్ష దీపోత్సవం, ప్రసాద వితరణ జరుగనున్నాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకుడు అంబరీష దాస తెలిపారు. వివరాలకు 95425 11108 నంబరులో సంప్రదించాలని కోరారు.

మందుబాబులకు రూ.2 లక్షల జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ పోలీసులకు పట్టుబడిన మందుబాబులకు న్యాయస్థానం రూ. 2 లక్షలు జరిమానా విధించింది. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాలివి.. జాతీయ రహదారిపై ఇటీవల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలలో 20 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.10 వేలు వంతున రెండు లక్షల రూపాయలు న్యాయస్థానం జరిమానాగా విధించిందని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం



టి.నగరపాలెంలో పార్కును ప్రారంభిస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం గోస్తని నది తీరంలో దివీస్ లేబరేటరీ యాజమాన్యం రూ.9 లక్షలతో నిర్మించిన పార్కుతో పాటు పరికరాలను సర్పంచ్ పొట్నూరు చంద్రశేఖర్ మంగళవారం ప్రారంభించారు. పార్కు చుట్టూ ఐరన్ కంచె, ఆట వస్తువులు, సిమెంట్ బల్లలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు పల్లా సన్యాసిరావు, మంగరాజు, రామచంద్రరావు, దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అంతర్జాతీయ సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ సాధన్ కె. ఘోష్

కొమ్మాది: గీతం డీమ్డ్ యూనివర్సిటీలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు వ్యర్థాల నిర్వహణ సర్క్యులర్ ఎకానమీపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.ఘోష్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా నిర్వహించనున్న సదస్సు వివరాలను ఆయన మంగళవారం వెల్లడించారు. సస్టెయినబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్క్యులర్ ఎకానమీ, ఐపీఎల్ గ్లోబల్ ఫోరమ్ - 2024 పేరిట జరిగే ఈ సదస్సుకు 60 దేశాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. 580 పరిశోధనా పత్రాలను వివిధ రంగాల నిపుణులకు సమర్పించామని తెలిపారు.

ప్రకృతి పరిరక్షణ్ యాప్‌ను వినియోగించుకోవాలి



ఆస్పత్రిలో పరీక్షలు చేస్తున్న ఆయుర్వేద వైద్యురాలు సుమ

పద్మనాభం: ప్రకృతి పరిరక్షణ్ మొబైల్ యాప్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా కో-ఆర్డినేటర్లు సౌజన్య, పద్మావతి ఒక ప్రకటనలో కోరారు. ఈ యాప్ ద్వారా ప్రజలకు ఆయుర్వేద వైద్యంపై పరిజ్ఞానం కలిగించనున్నట్టు తెలిపారు. మంగళవారం మొదలైన ఈ కార్యక్రమం వచ్చే నెల 25వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఆయుర్వేద ఆస్పత్రుల్లో, ఆయుర్వేద ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాల్లో ఆయుర్వేద వైద్యంపై పరిజ్ఞానం కల్పించనున్నట్టు తెలిపారు. ప్రజలు తమ శరీర తత్వం తెలుసుకుని, తదనుగుణంగా చేయాల్సిన దిన, రుతు చర్యలు పాటించడానికి, వ్యాధులు రాకుండా ఉండడానికి ప్రకృతి పరిరక్షణ్ యాప్ ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన

మధురవాడ: ఆయుర్వేద వైద్యంతో ఎన్నో రకాల లాభాలు ఉన్నాయని మధురవాడ ఆయుర్వేద వైద్యాధికారి సుమ అన్నారు. దేశ్‌కా ప్రకృతి పరిరక్షణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు ఆయుర్వేదవైద్యంపై అవగాహన కల్పించారు. వచ్చే నెల 25వరకు జరిగే ఈ క్యాంపెయిన్‌లో అందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు భీమిలి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో 3వ స్థానం సాధించిన శిర్లపాలెం జెడ్పీహైస్కూల్ విద్యార్థినులతో పీడీ సత్యం



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన భరత్

తగరపువలస: జాతీయస్థాయి ఖోఖో, ఫుట్‌బాల్ పోటీలకు భీమిలి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి 25 వరకు గుంటూరు జిల్లా కారంపూడిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీలకు ఆనందపురం మండలం శిర్లపాలెం జెడ్పీ హైస్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 8వ తరగతి విద్యార్థినులు రేగాని శృతిక, సారిక పవిత్ర, ఎర్ర హరిణి, 9వ తరగతి విద్యార్థిని రేగాని హర్షిణి ఉమ్మడి విశాఖ తరపున పాల్గొని రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం సాధించారు. రేగాని శృతిక రాష్ట్రం తరపున త్వరలో మధ్య ప్రదేశ్‌లో జరుగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. పీడీ సత్యంను సర్పంచ్ శిర్ల అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బోని అప్పలనాయుడు, పాఠశాల చైర్మన్ కోరాడ గౌరి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, బూర్లె వెంకటరమణ అభినందించారు.

- గత నెల 24 నుంచి 26 వరకు శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న చిట్టివలసకు చెందిన అనకాపల్లి భరత్ విశాఖ జిల్లా నుంచి మూడో స్థానం సాధించి జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో మహారాష్ట్రకు చెందిన నాందేడ్‌తో జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నాడు. భీమిలి సెయింటాన్స్‌లో 7వ తరగతి చదువుతున్న భరత్‌ను చిట్టివలస పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు అభినందించారు. భరత్ తండ్రి శివ కూడా పోలమాంబ క్లబ్‌కు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు కావడం గమనార్హం.

తీరంలో ఈదురు గాలులు

- రుషికొండలో నిలిచిన బోటు షికారు



తీరం వద్ద భద్రపరిచిన పర్యాటక బోట్లు

కొమ్మాది: తుఫాన్ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుండి తీర ప్రాంతాల్లో ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. భీమిలి నుండి సాగర్‌నగర్ బీచ్ వరకు ఈదురు గాలుల ప్రభావంతో సముద్రంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసి పడుతున్నాయి. ఇప్పటికే అధికారులు తీర ప్రాంత మత్స్యకారులను అప్రమత్తం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో మంగళవారం నుండి శనివారం వరకు బోటు షికారును నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉప్పాడ, తిమ్మాపురం, మంగమారిపేట మత్స్యకారులు తమ పడవలను, వలలను తీరం వద్ద భద్రపరుచుకుంటున్నారు.

గిరిజన ఉత్పత్తులను ప్రోత్సహించాలి



స్టాల్స్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ (టీసీఆర్‌టీఎం) కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గిరిజన సంతను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. జనజాతీయ గౌరవ దివస్‌లో భాగంగా గిరిజనుల ఉత్పత్తులను ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావడం మంచి విషయం అన్నారు. కార్యక్రమంలో టీసీఆర్‌టీఎం ఈడీ డా.రాణి మందా తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ ద్వారా ధాన్యం తరలింపు పరిశీలన

- జేసీ మయూర్ అశోక్
- బోనిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బోనిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా, చిత్రంలో జేసీ మయూర్ అశోక్

తగరపువలస: కల్లంలో ధాన్యం కొనుగోలు నుంచి మిల్లుకు తరలించే వరకు జీపీఎస్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికారులు వినియోగించుకోవాలని జేసీ మయూర్ అశోక్ సూచించారు. ఆనందపురం మండలం బోనిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కల్లంలో ధాన్యం తేమశాతం తెలుసుకునేందుకు వ్యత్యాసాలు లేకుండా పరికరాలు సిద్ధం చేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అధికారులు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత మాట్లాడుతూ ధాన్యం విక్రయించుకునే రైతులకు మూడురోజుల్లో నగదు వారి ఖాతాలో జమ అయ్యేలా ఆన్‌లైన్ వ్యవస్థను రూపొందించామన్నారు. ఆర్డీవో సంగీత్ మాథుర్, డీసీవోలు భాస్కర్, ప్రవీణ, జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి, ఎంపీడీవో జానకి, ఏపీఎంఐపీ డీఎం మన్మథరావు, భీమిలి ఏడీఏ విజయప్రసాద్, ఏవో సంధ్యారత్న ప్రభ పాల్గొన్నారు.

మద్దిలో సత్యదేవుని వ్రతాలు

పద్మనాభం: మద్ది సాధు మఠం ప్రాంగణంలో ఉన్న వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. 50 మంది దంపతులు వ్రతాలు నిర్వహించారు. సామవేదం బదిరికావాసు, సామవేదం బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ వ్రతాలు జరిగాయి.

తుఫాన్‌పై రైతులు అప్రమత్తంగా ఉండాలి

తగరపువలస: తుపాను అప్రమత్త చర్యలలో భాగంగా రైతులంతా వరి పంటను కోసిన తరువాత కుప్పలుగా పెట్టుకోవాలని ఆనందపురం వ్యవసాయాధికారి చావా సంధ్యా రత్నప్రభ సూచించారు. నూర్పు అయిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపించాలన్నారు.

భక్తితో కార్తీక దీపోత్సవం

పీఎం పాలెం: స్థానిక మూడో బస్టాపు సమీపంలోని రామాలయం ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై సిటూ నిరసన



అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలియజేస్తున్న సిటూ కార్యకర్తలు, నాయకులు

తగరపువలస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భీమిలి డివిజన్ సిటూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. చిట్టివలస సిటూ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ కూడలి మీదుగా సాగి, బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, రైతులపై కక్ష కట్టి పనిచేస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తుంగలో తొక్కారన్నారు. నిరసనలో నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, ఊళ్ల నాగరాజు, పల్లా పెంటరాజు, బొడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.